ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయం



తోటవీధిలో సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రూపకల్పన చేశారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం సచివాలయాల పరిధిలో చెవిటిరాములవీధి, తోట వీధి ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డులో పర్యటించి పలు సమస్యలను గుర్తించారు. వార్డులో స్థానిక కార్పొరేటర్ జాడ కనిపించడంలేదని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు శిథిలావస్థలో ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల శంకుస్థాపన చేసిన పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి నేటి వరకు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం.. చేస్తున్న అభివృద్ధి గురించి.. పథకాల అమలు తీరు గురించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, నాయకులు సాయిలత, ఎర్నికుమార్, నమ్మి శ్రీను, రాజు, కార్యకర్తలు, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించండి



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: వెంకటాపురం శ్మశాన వాటికలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని.. సరిహద్దుల్ని గుర్తించాలని జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వెంకటాపురం గ్రామస్తులు కోరారు. గతంలో మండల రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా కోరారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఇక్కడున్న 109, 110 సర్వే నంబర్లలో ఉన్న శ్మశాన వాటిక ప్రాంతాన్ని సర్వే చేసేందుకు వచ్చారు. అయితే దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో శ్మశాన వాటిక ప్రాంతంగా ఉన్న మొత్తం 7 ఎకరాల పైచిలుక స్థలాన్ని సర్వే చేసి, బౌండరీని గుర్తించాలని కోరారు. ఈ సర్వే విషయం తెలిసి వచ్చిన బెహరా భాస్కరరావు గ్రామస్తులు కోరిన విధంగా సర్వే చేపట్టాలని వీఆర్వో సుబ్రహ్మణ్యానికి కోరారు. దీనిపై ఆర్డీవోకు కూడా లిఖితపూర్వకంగా అర్జీ పెడతామని తెలిపారు. ఇందులో చాలా మేరకు పంట భూమిగా మార్పు చెందిందని స్థానికులు చెబుతున్నారు. ఈ బౌండరీ వ్యవహారం తేలితే జీవీఎంసీ ద్వారా ప్రహరీ నిర్మించి సుందరీకరణ పనులు చేపడతామని తెలిపారు. ఇందు కోసం సుమారు రూ. 98 లక్షలు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో కొంత స్థలం ముస్లిం బరియల్ గ్రౌండ్ కోసం కేటాయించేందుకు సమాలోచన చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకు గ్రామస్తులతో చర్చిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, గొంతిన నాగరాజు, నాలాపు శ్రీనివాసరెడ్డి, నీలాపు లోకేష్‌రెడ్డి, సత్యనారాయణ, అభిరామ్, చంద్రశేఖర్, వెంకటాపురం గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరాసా ముస్లిం శ్మశాన వాటిక పరిశీలన



కరాసా ముస్లిం శ్మశాన వాటికలో పర్యటిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని

గోపాలపట్నం: కరాసా శ్మశాన వాటికలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పర్యటించారు. శ్మశాన వాటిక సమస్యలపై స్థానిక ముస్లింలు ఆయన దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన ప్రత్యేకంగా పర్యటించారు. శ్మశాన వాటికలో రోడ్లు, విద్యుత్ దీపాలు, విశ్రాంతి భవనం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఆయనతో పాటు వచ్చిన జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో ప్రణాళికలు సిద్ధం చేయాలని జియ్యాని సూచించారు. ఈ మేరకు ఆయనకు ముస్లిం పెద్దలు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఏడుకొండలు, ఏఈ ఉష, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం సేవించే వారిపై చర్యలు

మల్కాపురం : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు మల్కాపురం పోలీసులు ఆర్కేపురం పాత పెట్రోల్ బంక్ వద్ద బహిరంగంగా మద్యం సేవిస్తున్న పులువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల బహిరంగంగా మద్యం సేవించడంతో పాటు మద్యం మత్తులో స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారే ఆరోపణలపై మల్కాపురం పోలీసులు గురువారం బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు.

రేపటి నుంచి షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు



షిర్డీ సాయిబాబా

ఆరిలోవ: చినగదిలిలో నార్త్ షిర్డీ సాయి బాబా ఆలయ 10వ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఈ ఆలయాన్ని కమిటీ సభ్యులు సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలు, పచ్చని కొమ్మలతో అలంకరించారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్టు కమిటీ చీఫ్ సెక్రటరీ వానపల్లి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం పురవీధుల్లో బాబా రథోత్సవం, 12న ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకాహం, ఓం సాయి, శ్రీసాయి, జైజై సాయి అనే మాల మంత్ర ఉచ్చారణ కార్యక్రమం జరుగుతుందన్నారు. 13న ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కలశ పూజ, 11 గంటలకు బాబాకు అన్నాభిషేకం, మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ, సాయంత్రం పల్లకి సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. బాబా దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు

సంకటమోచన గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులో కొలువుదీరిన సంకట మోచన గణపతి ఆలయంలో సంకట హర చతుర్థిని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు, అభిషేకాల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. దంపతులతో కుంకుమ పూజలు చేయించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నర్సింహమూర్తి పర్యవేక్షించారు.

గుల్లలపాలెంలో షూటింగ్ సందడి



చిత్ర హీరో, హీరోయిన్లు నరేష్ ఆగస్త్య, శ్వేత

మల్కాపురం : డెక్కన్ డ్రీమ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో 'దిల్‌వాలా' చిత్రం షూటింగ్ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద గురువారం జరిగింది. షూటింగ్ చూసేందుకు మల్కాపురం నుండి జింక్ వరకు పలువురు అక్కడ గుమిగూడారు. ఉదయం నుండి సాయంత్రం వరకు మార్కెట్ వద్దే పలు సన్నివేశాలు చిత్రీకరించారు. చిత్ర హీరో నరేష్ ఆగస్త్య, సీనియర్ హాస్య నటుడు రాజేంద్రప్రసాద్‌కు సంబంధించిన సన్నివేశాలు ఇక్కడ చిత్రీకరించారు. ప్రముఖ డైరెక్టర్‌వీరభద్ర చౌదరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రంలో నరేష్ ఆగస్త్య, శ్వేత హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇతర ప్రాతల్లో సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్, లహరి, ఆలీరాజా, అవినాష్ కనిపించనున్నారు. మార్కెట్ వద్ద హీరో, రౌడీల మధ్య పోరాట దృశ్యాలు చిత్రీకరించారు. ఈ చిత్రానికి అభిషేక్, నరసింహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం నుండి నగరంలోని పలు ప్రాంతాల్లో షూటింగ్ చేయనున్నట్లు డైరెక్టర్ వీరభద్ర చౌదరి తెలిపారు. వచ్చే వారం ఇక్కడే షూటింగ్ జరిగే అవకాశం ఉందన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోపాలపట్నం: మర్రిపాలెం, శాంతినగర్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మర్రిపాలెం పరిధి జ్యోతినగర్, లక్ష్మీనగర్, శాంతినగర్ ఫీడర్ పరిధిలో శాంతినగర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



వైఎస్సార్ బీమా సాయం అందిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా : జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లో పూడి గోవిందరావు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయాన్ని వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అందజేశారు. గోవిందరావు అనారోగ్య సమస్యలతో ఈ నెల 7వ తేదీన మరణించారు. మృతుడు వైఎస్సార్ బీమా కలిగి ఉండడంతో గురువారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు తక్షణ సాయం కింద రూ. 10 వేలు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు కన్వీనర్లు భారతి, ఎస్.సూర్యనారాయణ, సత్యనారాయణ, గణపతి, ఎం. చిన్నారావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'భోజనం' నాణ్యత పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న దాడి

మల్కాపురం : జీవీఎంసీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందజేస్తున్న భోజనం నాణ్యత, సౌకర్యాలపై వైఎస్సార్‌సీపీ 61వ వార్డు నాయకుడు దాడి సత్యనారాయణ ఆరా తీశారు. వార్డు పరిధి ఇండ్రస్టియల్ కాలనీ వద్ద గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వద్దకు గురువారం మధ్యాహ్నం స్థానిక నాయకులతో కలిసి వెళ్లారు. విద్యార్థులతో కలిసి అక్కడ భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఐటీ విభాగం ప్రతినిధి కొల్లి నూకరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

728వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను సృష్టించే ప్రయత్నం చేయాలి కానీ అమ్ముకూడదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 728వ రోజు, గురువారం కన్‌స్ట్రక్షన్, ట్రాఫిక్, ఆర్ఎండీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, సీహెచ్ సన్యాసిరావు, అప్పలరాజు, గుమ్మడి నరేంద్ర తదితరులు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగంగా యాజమాన్యం ఉక్కు ఉత్పత్తుల తయారీకి కావలసిన ముడి సరుకులను సమకూర్చడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రోజుకో విభాగంలో ఉత్పత్తిని నిలిపివేస్తూ కొన్ని విభాగాలను ప్రైవేటు వారికి కట్టబెట్టాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు మారాలన్నారు. ప్రజా ఉద్యమాలకు ఎంత పెద్ద నియంతైనా తలవంచక తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో హరనాథ్, ఈశ్వరరావు, అప్పారావు, శ్రీనివాసరావు, అశోక్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంపై అధిష్ఠింపజేసి, 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి జరిపారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, అప్పాజీ తదితరులు ఈ సేవ నిర్వహించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేయింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా సాగింది. పూజల్లో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

గర్భిణుల్లో హెచ్‌ఐవీ స్థాయి గుర్తింపునకు సర్వే



గణాంకాలను పరిశీలిస్తున్న ఏపీవో కామేశ్వరరావు

అగనంపూడి: గర్భిణుల్లో హెచ్‌ఐవీ స్థాయి, శాతాన్ని గుర్తించేందుకు హెచ్‌ఐవీ సెంటినల్ సర్వేలెన్స్ (హెచ్‌ఎస్ఎస్) నిర్వహిస్తున్నట్టు ఐసీటీసీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ వై.కామేశ్వరరావు అన్నారు. అగనంపూడి ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటర్)లో ఈ నెల 2వ తేదీ నుంచి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సర్వే తీరును పరిశీలించేందుకు అగనంపూడి ఆస్పత్రికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ శాతం గుర్తించడం ద్వారా గతానికి ఇప్పుడు ఉన్న వ్యత్యాసాన్ని బేరీజు వేసుకుని తీసుకోవల్సిన చర్యల గురించి చర్చిస్తామన్నారు. గర్భ నిర్ధారణకు వచ్చే సమయంలో మహిళలకు ఈ పరీక్షలు నిర్వహించడం ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తి, తగ్గుదల వంటి వాటిని గుర్తించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఐఎస్ బద్రీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, ఆర్ఎంవో గోపాలకృష్ణ, ఐసీటీసీ కౌన్సెలర్ ఎం.వి.రవికుమార్, ఎల్‌టీ కె.కళావతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే టైంటేబుల్ పత్రాల పంపిణీ

అగనంపూడి: రైళ్ల రాకపోకల వివరాలతో దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన టైమ్ టేబుల్ పత్రాలను అసోసియేషన్ ప్రతినిధులు గురువారం పంపిణీ చేశారు. దువ్వాడ రైల్వేస్టేషన్స్, దువ్వాడ, వీఎస్ఈజెడ్, 85, 88 వార్డులోని కాలనీలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో వీటిని అందజేశారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఆగుతున్న రైళ్లు, రాకపోకల సమయం, వివరాలతో పొందుపరిచిన పాంప్లెట్‌ను పంచి పెట్టినట్లు ప్రతినిధులు కె.ఈశ్వర్, కె.చంద్రరావు తెలిపారు. ప్రయాణికులు, స్థానికులకు ఈ సమాచారం ఉపయోగపడుతుందని భావిస్తున్నామన్నారు. స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ డైరీలోనూ రైళ్ల రాకపోకల వివరాలను ముద్రించినట్లు వారు తెలిపారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి



కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో రోటరీ ఫౌండేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: కుట్టు శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ప్రోగ్రామ్ ఇన్‌చార్జి, రోటరీ ఫౌండేషన్ పూర్వ గవర్నర్ ఎం.జగదీశ్వరరావు అన్నారు. వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. వృత్తి విద్యలో భాగంగా గ్లోబల్ గ్రాండ్ ద్వారా రోటరీ ఫౌండేషన్ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో 47 మంది పేద మహిళలకు 3 నెలల పాటు కుట్టు పనిలో శిక్షణ ఇచ్చారు. అనంతరం వారికి అక్కిరెడ్డిపాలెం వద్ద గల పంచవటీలో రోటరీ ఫౌండేషన్, జనశిక్షణ సంస్థాన్ ప్రతినిధుల చేతుల మీదుగా సర్టిఫికెట్లతో పాటు మోటారుతో కూడిన కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జగదీశ్వరరావు మాట్లాడుతూ విశాఖపట్నంలో 6 సెంటర్లలో 12 షిఫ్టులుగా 261 మందికి 3 నెలల పాటు జనశిక్షణ సంస్థాన్ శిక్షకులతో కుట్టు పనిలో శిక్షణ ఇచ్చామని చెప్పారు. రోటరీ ఫౌండేషన్ పూర్వ గవర్నర్ డాక్టర్ డి.వి.ఆర్.పోషా మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లతో పాటు బ్యాంకు రుణాలు పొందే అవకాశాన్ని కల్పించి, ఉపాధి పొందేవిధంగా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ సీహెచ్.రామరాజు, డైరెక్టర్ సీహెచ్.అప్పలనాయుడు, అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అప్పలరాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మాధవ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్ అన్నారు. ఉక్కునగరం బీఎంఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా సెయిల్‌లో గాని, ఎన్ఎండీసీలో గాని విలీనం చేసేలా ప్రయత్నిస్తున్నామన్నారు. ఉక్కు అధికారులు, కార్మికుల వేతన ఒప్పందం, అధికారుల పదోన్నతుల అంశాలపై పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకు ముందు కేంద్ర ఉక్కు అదనపు కార్యదర్శి రుచికా చౌదరి గోయల్, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (ఫైనాన్స్) వి.వి. వేణుగోపాలరావు, స్టీల్‌ప్లాంట్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఘన్ శ్యామ్ సింగ్‌లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెన్నా శ్రీరామ్మూర్తి, కృష్ణంరాజు, శ్రీనివాసరావు, బీఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతే ఉన్నత విద్యకు కీలకం

- ఉన్నత లక్ష్యంతో సంసిద్ధం కావాలి
- ఆర్‌జేడీ జ్యోతికుమారి
- నడుపూరు జెడ్పీ హైస్కూల్ సందర్శన



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతికుమారి

పెదగంట్యాడ: ప్రతి విద్యార్థికీ పదో తరగతి అత్యంత కీలకమని పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జ్యోతికుమారి అన్నారు. భవిష్యత్తుకు పునాది ఇక్కడే వేసుకోవాలని సూచించారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి, భవనాల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పదో తరగతి విద్యార్థుల విద్యా స్థాయిని పెంచాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని చదివించాలని కోరారు. ఈ ఏడాది పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఆదేశించారు. పరీక్షలంటే విద్యార్థుల్లో భయం ఉంటుందని, వారిలో అభద్రతా భావం లేకుండా తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ విద్యార్థి బాగా చదవాలన్నారు. పదో తరగతిలోనే లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు.

విద్యాప్రమాణాలు పెంచాలి

ఆర్‌జేడీ జ్యోతికుమారి నడుపూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యా ప్రమాణాలు పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. పాఠశాల భవనాలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు ఎదురైతే, పక్కనే ఉన్న కమ్యూనిటీ హాలును వినియోగించుకోవాలని సూచించారు. ఆమె వెంట మండల విద్యాశాఖాధికారి పైడపునాయుడు, నడుపూరు హైస్కూల్ హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్, మంత్రి రాజశేఖర్, మంత్రి గోపీ, మంత్రి శంకరనారాయణ ఉన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు కూడా గురువారం ఉదయం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. విద్యార్థుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

పసి గుండె పదిలంగా..

అక్కిరెడ్డిపాలెం: పెద్దవారిలో గుండె సమస్యలు రావటం పరిపాటి. కానీ, ప్రస్తుత కాలంలో పుట్టుకతోనే గుండె సమస్యలతో జన్మిస్తున్న చిన్నారుల సంఖ్య పెరగడం ఆందోళనకు దారితీస్తోంది. ఈ సమస్యను అధిగమించాలంటే అవగాహన, చికిత్సలతోనే సాధ్యమవుతుందంటున్నారు షీలానగర్ కిమ్స్ ఐకాన్‌కు చెందిన చిన్న పిల్లల గుండె వైద్య నిపుణురాలు డాక్టర్ శాంతిప్రియ. చిన్నపిల్లల్లో వచ్చే గుండె సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా, గురువారం ఆమె ఈ అంశంపై పలు విషయాలను వెల్లడించారు. మన దేశంలో పుట్టుకతోనే గుండె జబ్బుతో జన్మించే పిల్లల సంఖ్య ఏటా 2లక్షల కంటే ఎక్కువగానే ఉంటోందన్నారు. ఆ చిన్నారులు పాలు సరిగ్గా తాగలేరని, తరచూ ఆయాసం, న్యుమోనియా బారిన పడతారని తెలిపారు. తల్లి 18వారాల గర్భంతో ఉన్నప్పుడే చిన్నారుల్లో గుండె లోపాలను గుర్తించవచ్చని తెలియజేశారు. వారిలో 60శాతం మందిలో గుండెల్లో ఏర్పడిన రంధ్రాలు వాటికవే మూసుకుపోతాయని, వారికి శస్త్రచికిత్స అవసరం లేదని చెప్పారు. గుండె లోపాలతో పుట్టిన 20 శాతం మందికి పుట్టిన నెలలోపే శస్త్రచికిత్స అవసరం ఉంటుందన్నారు. 30 శాతం సమస్యలను గొట్టం సాయంతో చేసే శస్త్రచికిత్సలతో సరి చేయవచ్చని, ఇందులో ఎలాంటి మచ్చ ఏర్పడకుండా పిల్లలు త్వరగా కోలుకుంటారని వివరించారు.

12న రక్తదాన శిబిరం

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12, ఆదివారం నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సత్యసాయి రక్తదాన కో–ఆర్డినేటర్ రామాంజనేయ రాజు కోరారు. ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద రక్తదాన శిబిరం నిర్వహణపై గురువారం ప్రచారం చేశారు. ఇప్పటి వరకు ఉక్కునగరం సత్యసాయి సమితి ఆధ్వర్యంలో 33 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని అందజేస్తున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని ఆదుకోవచ్చన్నారు. వైజాగ్ స్టీల్ సిటీ సహకారంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్. రవికుమార్, విష్ణుమూర్తి, రంగరాజు, సంతోష్ కుమార్, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థులకు ఇన్ఫోసిస్‌లో ప్లేస్‌మెంట్లు



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

గోపాలపట్నం: ఆదిత్య డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధులు నిర్వహించిన క్యాంపస్ ఇటర్వ్యూల్లో 107 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహనరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ. 2.2 లక్షల జీతం అందివ్వనున్నారని పేర్కొన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి టి. సింహాచలం, అధ్యాపకులు ఎస్. జయలక్ష్మి, జి. మాధురి, ప్రిన్సిపాల్ మురళీమోహనరావు విద్యార్థులను అభినందించారు.